

# కొత్త జీవితం

వి. రాజా రామమోహన రావు

బండి నిండా సామానుంది.

ఆ సామానుమీదకెక్కి నాలుగు కాళ్ళు ఆకాశంలోకి ఎత్తి పడుకునుంది నవ్వారు మాసిన మంచం. కుదుపులకి అదెప్పుడు పడిపోతుందో అన్నట్టు దానివేపే చూస్తూ నడుస్తున్నాడు రామారావు.

"బాబు కాలు బాగా ముందుకి పెట్టాడు. చక్రంలో పడుతుందేమో చూడండి." అంది ఊర్మిళ వెనకనుంచి...

నడిపిస్తున్న సైకిల్నాపి ముందుకూచున్న కుర్రాడి కాళ్ళు సద్దాడు రామారావు. ఈలోగా ఊర్మిళ కూడా వచ్చి కలుసుకుంది. తిరిగి నడవటం మొదలెట్టారు. నిండుమనిషవటం వల్ల తొందరగా నడవలేకపోతోంది. ఊర్మిళ ముందు వెళ్ళే సామానుబండిని వదల్లేక...భార్యనీ వదల్లేక, నెమ్మదిగా రెండువేపులా చూస్తూ నడుస్తూ వచ్చాడు రామారావు. అంతకీ ఊర్మిళ బాగా వెనక పడితే ఒకటి రెండుసార్లు బండిని ఆపించాడు.

"ఇంక వచ్చేశాంలే..." అన్నాడు ఊర్మిళ వేపుచూస్తూ...

పరవాలేదన్నట్టు రామారావు వేపుచూసి నెమ్మదిగా నవ్వింది ఆమె ముఖంమీదకొద్దిగా చెమట పట్టింది. బొట్టు వో పక్కన కొద్దిగా కరిగి రేఖలా కిందకి జారింది.

తనకోసం, సంసారం కోసం ఊర్మిళ అలాచిరునవ్వుతో ఎంతకష్టమేనా భరించటం అంతకుముందు చాలాసార్లు చూశాడు రామారావు. అలా చూసినప్పుడల్లా రామారావుకి ఒకటే అనిపించేది...యీ బతుకు ఆర్థికంగా యింకొంచం బావుంటే ఎంత బావుణ్ణు అని. వచ్చే ఆదాయాన్ని జీవితంలోని ముఖ్యావసరాలకే అంతంత మాత్రంగా సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇంక అదనపు సౌఖ్యాలు సంతోషాలు అన్న ప్రసక్తే లేకుండా పోయింది.

ఇదీ అని ఖచ్చితంగా చెప్పలేని శక్తేదో వెనకనుంచి తోస్తుంటే బలవంతంగా కదలుతున్నట్టుంది బతుకు. యిలాంటి కదిలికే యీ యింటి మార్పుకూడా.

ముందు చాలా రోజులు వున్నయింట్లోనే ఎలాగోలాగు సర్దుకు గడిపేయాలనుకున్నాడు. ఆ తర్వాత చాలా రోజులు మంచియిల్లు దొరగ్గానే మార్చాలి అనుకుంటూ గడిపాడు. చివరికి యీ నాటికి వేరే యింట్లోకి మార్పుతప్పలేదు.

ఏ కొద్ది మందో తప్ప నగరంలో చాలా మంది యిళ్ళవాళ్ళు అద్దెకుండేవారి మీదఏదో రకం అధికారం చెలాయిస్తారని రామారావుకి తెలుసు. అది దృష్టిలో వుంచుకునే చాలారోజులు సద్దుకుంటూ వచ్చాడు. కాని రాను రాను యింటివాళ్ళ కోపతాపాలు తట్టుకోలేనంతగా తయారయ్యాయి. చివరికి మనుషుల పక్కన కాకుండా పొంచి కూచున్న మృగాల పక్కన కాపురం వున్నట్టు తయారైంది. అద్దెకుండాల్సినప్పుడు ఏ యిల్లైనా వొకటే నని రామారావు ఉద్దేశం. ఇల్లుమారటమంటే ఖర్చని చాలారోజులు వెనకాడాడు. ఇదైనా ప్రెస్‌లో తనతో పాటు పనిచేసే మూర్తి చెప్పింది...అతనింటి పక్కనే...రామారావు స్వయంగా వెతికింది కాదు.

ఇదీ ఒంటిగది యిల్లే...అద్దెలో కూడా పెద్ద భేదమేం లేదు.

ఎండకొద్దిగా పెరుగుతోంది.

"అదిగో అదేయిల్లు..." అంటూ చేయెత్తి చూపించాడు రామారావు ఊర్మిళకి. బండివాణ్ణి అక్కడ ఆగమని కొంచం గట్టిగా కేకేశాడు రామారావు.

చిన్నగుమ్మం దాటి నెమ్మదిగా ఆవరణలో కాలుపెట్టింది ఊర్మిళ. అంతవరకు నడిచిరావటం వల్ల, నిలబడేటప్పటికి పాదాలు కొంచం వొణుకుతున్నట్టనిపించాయి. లోపలికి మరో రెండడుగులేసింది. నిండుగా...పచ్చగా... పెద్దవేపచెట్టు.

చెట్టుకిందకి చేరేటప్పటికి అంతవరకు అనుభవించిన ఎండవేడి తెలియలేదు ఊర్మిళకి చల్లటితల్లి వొడిలో వున్నట్టనిపించింది. అలికిడికి లోపల్నించి మూర్తీ అతని భార్యలక్ష్మి బైటికొచ్చారు.

○ ○ ○

నాలుగురోజులు గడిచేలోపలే ఊర్మిళకి యిల్లు బాగా అలవాటైంది. ఆరోజు రామారావు ప్రెస్‌కి శెలవ.

రోజులా హడావిడి లేకుండా, తాపీగా భోజనానికి కూచున్నాడు. ఆ కబురు యీ కబురు మాట్లాడుతూ భోజనం పూర్తి చేశాడు. ఊర్మిళ భోజనం యింకా కాలేదు. వడ్డనవల్ల కబుర్ల వల్ల ఆలశ్యంఅయింది. ఊర్మిళ యిది వరకటికన్నా ఉత్సాహంగా కనిపించింది రామారావుకి. కారణమేమై వుంటుందా అన్న ఆలోచనలో వుండగానే...

"ఈ యింటిమార్పు మీకు బావుండ లేదూ" అంది ఊర్మిళ...

ఇంటి మార్పులో ఊర్మిళకి తెలిసినంతగా తేడా రామారావుకి తెలియలేదు. అందుకనే ఏమనాలో తోచక...

"నీకు బావుందా..." అన్నాడు.

"తలమీంచి పెద్దబరువు దిగినట్టుంది. ఒంటిగదే అయినా నా మటుకు నాకుస్వర్గంలావుంది మీ మూర్తిగారి లక్ష్మి ఎంతగాకలిసిపోయిందో తెలుసా...ఆ యింట్లో మనకి మనం వొంటరిగా ఎడారిలో వున్నట్టుండేది. ఇంక పురుడు గురించి నాకేం బెంగలేదు...లక్ష్మిఅదేఅంది. ఎంతైనా యిరుగుపొరుగూ మనతోకలిసేవాళ్ళు దగ్గరుండాలి..." అంది ఊర్మిళ...

మొదటికాన్పుకూడా ఊర్మిళ వొంటరిగానే పోసుకోటం గుర్తొచ్చింది రామారావుకి. ఇద్దరి తరఫున చుట్టాలెవరూ లేకపోటం వల్ల తమంత తామే తంటాలు పడవల్సి వచ్చింది. ఇద్దరికీ కొత్త...కంగారు... సరిగా సలహాయేనా చెప్పేవారు లేకపోవటం...అన్నీగుర్తొచ్చాయి వున్న దూరపు బంధువొక్కావిడ ఎక్కడో ఆరొందల మైళ్ళ దూరంలో వుంది. వరసకి పిన్ని...తమలో బాగా కలిసిపోయే మనిషే... ఆవిడకి వెనకాముందూ ఎవరూ లేరు. మొదటి కాన్పుకి ఆవిణ్ని పిలిపించాలనుకున్నాడు రామారావు. ఏనెలకానెల ఎత్తినాటుగా వొక్కోసారి ఖర్జులకి డబ్బుపంపడం కుదరక; ఆవిడ రావటం కుదరలేదు ఈసారి పరిస్థితి అంతంత మాత్రగానే వుంది.

అందుకే రామారావులో స్తబ్ధత... ఖర్చే ఆదాయాన్ని మించిన అవసరాలు...ఆదాయం పెరిగే అవకాశంలేదు. పస్తులుండటంతప్ప. అప్పులు చెయ్యకుండా వుండే అవకాశంలేదు. వో అప్పుచేసి మరో అప్పుతీర్చటం అవుతోంది.

ఈ డబ్బువొత్తిడికి తట్టుకోలేక జీవితంలో ఏమార్పున్నా అయిష్టత ఏర్పడిందిరామారావుకి బతుకులో ఏదిమార్పుకుంటే ఏం కొంప మునుగుతుందో అని వో భయం ఏర్పడింది.

"ఏమిటండీ ఆలోచన..." అని ఊర్మిళ అనేవరకూ తేరుకోలేదు రామారావు.

"ఏ రోజు ఎలా వుంటుందో చెప్పలేం అని అందుకే అంటారు. నా మటుకు నాకుయిల్లు మనకీ కలిసొస్తుందనే అనిపిస్తోంది" అంది తిరిగి ఊర్మిళ.

ఆ గొంతులో గట్టిధైర్యం ధ్వనించింది. రామారావుకి; 'నిజమే యిలా నిరుత్సాహపడే కన్నా, ఊర్మిళలా ఆశగా వుత్సాహంగా వుండటమే మంచిది' అనుకున్నాడు.

ఆ తర్వాత వారం తిరక్కుండాచాలాప్లాన్స్ చెప్పింది ఊర్మిళ. అది జరిగేవైనా కాకపోయినా, వాటివెనక ఊర్మిళ ఉత్సాహం


With the Best Compliments
Grams : "COPPER"

Phones : Office : 76362
Resi : 75631

**TALLAM SATYANARAYANA & SONS**

Wholesale Dealers In :

**BRASS COPPER & STAINLESS STEEL**

Post Box No 31
*Sivalayam Street*
**VIJAYAWADA-520001**



ఫోన్ : 24 రె. సి.

**సలాది అచ్చెయ్య అండ్ కో**

ధాన్యం, బియ్యం అండ్ జనరల్ మర్చంట్సు
కాంట్రాక్టర్స్: శ్రీ రామా రైస్ మిల్
**అనాతవరం** (ముమ్మిడివరం తాలూకా)

చూసుంటే రామారావుకి కొద్దోగొప్పో భవిష్యత్తుమీద ఆశ పెరిగింది. వాటిలోదే ఊర్మిళ వుద్యోగం ప్లాన్.

రామారావుతో పనిచేసే మూర్తి పెద్దసంపాదన పరుడుకాదు. కాకపోతే భార్యలక్ష్మికూడా పనిచేస్తోంది. ఇద్దరి సంపాదనవల్ల యిల్లుగడవటం రామారావు వాళ్ళంత యిబ్బందిగా లేదు. రామారావుకి యిష్టమైతే నెమ్మదిగా లక్ష్మిలా తనూ ఎక్కడో అక్కడ వుద్యోగంలో చేరతానంది ఊర్మిళ.

పాతయింటికన్నా యీ యింట్లో రోజులు తొందరగా గడుస్తున్నట్టు తోచాయిరామారావుకి ఊర్మిళకి. ఖాళీ వున్నప్పుడు రెండువాటాల వాళ్ళువేపచెట్టుకింద చేరి సరదాగా కబుర్లతో కాలక్షేపం చేస్నేవాళ్ళు.

జీతాలరోజు...అప్పుల వాళ్ళకివ్వటం... తిరిగి అప్పులు చెయ్యటం. యీ రొటీన్ మామూలుగానే వున్నా. యీ కాలక్షేపం కబుర్లు, వేపచెట్టునీడ రామారావుకి చాలావరకు రిలీఫ్ నిచ్చాయి.


○ ○ ○ ○

కొత్తింట్లో రెండు నెలలు గడిచాయి ... ఊర్మిళకి నెలలు నిండాయి. రోజులు గడుస్తున్నకొద్దీ రామారావులో వో ఆలోచన బలపట్టం మొదలెట్టింది... ఊర్మిళ కాన్పు అయిపోతే తమకింక లోటేంవుండదని...బతుకులో ఏవో బలమైన మార్పు వచ్చి చాలా ఉత్సాహంగా వుంటుందని రామారావు మనసులో యీ ఆలోచన ఎప్పుడు ఎలా చోటు చేసుకుందోగాని. దాని వెనక బలమైన ఆధారం లేకపోయినా రోజు రోజుకి అది బలపడుతూ వచ్చింది. దానితో యిదివరకటి కన్నా మరికాస్త ఉత్సాహంగా వుంటున్నాడు.

ఆ రోజు మామూలుగా భోజనాలయ్యాక బైటపక్కేసుకుని పడుకున్నాడు. రాత్రి రెండు దాటాక ఊర్మిళ తట్టిలేపుతుంటే మెలకువొచ్చింది రామారావుకి... అప్పటికే నెప్పులు మొదలయ్యాయి ఊర్మిళకి...

పిలవగానే లేచాడు లక్ష్మి వాళ్ళు ముందే అంతా అనుకునుండటం వల్ల లక్ష్మే దగ్గరుండి హాస్పిటల్‌కి తీసికెళ్ళింది. తెల తెలవారుతుండగా ఆడపిల్ల పుట్టింది.

సూర్యోదయపు తొలి వెలుగులో మొదటిసారి ఆ పాపని చూసుకున్నాడు రామారావు. తెల్లటి వొళ్ళు...అక్కడక్కడ ఎర్రగా కందిపోయింది. చిన్న చిన్న చేతులు కదుపుతూ ఊర్మిళవేపు తిరిగి పడుకునుంది. అలసట. ఆనందం కలగలిపిన చూపుల్తో రామారావువేపు చూసి నవ్వింది ఊర్మిళ. ఆదే సన్నటి




నవ్వు ... రామారావు ఎన్నోసార్లు చూసిన నవ్వు ... రామారావూ నెమ్మదిగా నవ్వాడు

ఆరోజు ప్రెస్‌కి శెలవ పెట్టాడు రామారావు. పెద్ద పనులేం లేవు. చెయ్యటానికి ... వున్న పనులన్నీ లక్ష్మి చేసింది. అయినా ఎందుకో పనికి వెళ్ళాలని పించలేదు రామారావుకి. ఇంట్లోనే వొంటరిగా పడుకుని ఏవేవో ఆలోచనల్తో గడిపేశాడు.

గదినిండా సామానులున్నా యిరుగ్గా అనిపించలేదు. చాలా విశాలంగా వున్నట్టు ... గదిగోడలు తమ పరిధిదాటి ఎంతో వైశాల్యం పెంచినట్టు తోచింది రామారావు మనసుకి. ఆ క్షణాన అతని ఆలోచన వుత్సాహం అలా వున్నాయి ... వాటి వెనక ఊర్మిళ గొంతు వినిపిస్తోనే వుంది...నవ్వు కనిపిస్తోనేవుంది... ఊర్మిళ అన్నట్టు యింక జీవితంలో యింత యిబ్బంది వుండదు ... నెమ్మదిమీద తనకీ ఎక్కడో అక్కడ వుద్యోగం చూస్తే యీ డబ్బు యిబ్బందులుండవు... వున్న అప్పులూ తీర్చేయచ్చు. రామారావు ఊహలు ఏ అడ్డూ లేకుండా అలా స్వేచ్ఛగా సాగుతూనే వున్నాయి ఆ రోజంతా...

కాన్పు తేలిగ్గా కావటంవల్ల, కులాసాగా వుండటం వల్ల ఆ మర్నాడే యింటి కొచ్చేసింది ఊర్మిళ...

○ ○ ○ ○

రామారావు ఆశలు పెరిగినంతసేపు వూహలు సాగినంతసేపు పట్టలేదు...

ఊర్మిళ పురుడు పోసుకుని యింటికొచ్చిన నాలుగోరోజది. ఆ సాయంత్రంకూడా మామూలుగానే రామారావు, మూర్తి కలిసి ప్రెస్ నుంచి వచ్చారు. అప్పటికే లక్ష్మి. ఊర్మిళ దగ్గరుంది. ఊర్మిళ వొంటినిండా రెండు దుప్పట్లు కప్పివున్నాయి... దుప్పట్లతో సహా వొణుకుతూనే వుంది ఊర్మిళ.

"వున్నట్టుండి కమ్ముకొచ్చింది జ్వరం... గంటకూడా కాలేదు... బాలింతరాలికి జ్వరం మంచిదికాదు ... మీ గురించే చూస్తున్నాను. వెంటనే డాక్టరు దగ్గరికి తీసికెళదాం...రిక్షా పిలుచుకు రండి..." అంది లక్ష్మి.

సరేనని బైటికి నడిచాడు రామారావు ... ఆ తర్వాత అన్నీ వూహకందనంత త్వరితంగా జరిగిపోయాయి.

ఇంటికి దగ్గర్లోవున్న డాక్టరు దగ్గరికే తీసికెళ్ళారు. ఏదో యింజక్షన్ రాసిస్తే రామారావు వెళ్ళి తీసుకొచ్చాడు. ఇంజక్షనిచ్చాక ఊర్మిళకి కొంచం వొణుకు తగ్గింది. డాక్టరు మరేం ఫరవాలేదని. యింటికి తీసికెళ్ళమని అన్నాక...యింటికి తీసుకొచ్చారు.

ఇంటికొచ్చాక అలా నీరసంగానే వొకటి రెండు మాటలు మాట్లాడింది ఊర్మిళ. ఆ

తర్వాత వో అరగంట మగతగా కళ్ళు మూసింది.

రామారావు మంచం పట్టిమీద. ఊర్మిళ వేపే చూస్తూ కూచున్నాడు. అలా చూస్తుండగానే ఊర్మిళ పెదాలు, బుగ్గలు వొణకటం మొదలెట్టాయి ... కాస్సేపటికి పెదాలు బిగదీసుకున్నాయి...పళ్ళు బిగబట్టింది...చేతులు కాళ్ళు గింజుకుంది... ముంజేతులు మెలికలు తిరిగాయి. ఏం జరుగుతోందో అర్థం కాలేదు రామారావుకి... చివరికి ఎలాగో 'మూర్తీ' అని గట్టిగా కేకేశాడు.

మూర్తి వెళ్ళి టాక్సీ తెచ్చాడు. గవర్నమెంట్ హాస్పిటల్ చేరేలోపల కర్రలా బిగుసుకుపోయింది ఊర్మిళ. హాస్పిటల్ చేరేవరకు కంగారు తప్ప మరేం తెలియలేదు రామారావుకి. చేరింతర్వాత, కళ్ళముందు నుంచి ఊర్మిళని లోపలికి తీసికెళ్ళిపోయిన తర్వాత భయంవేసింది... వొళ్ళంతా వొణికినట్టనిపించింది ... అరికాళ్ళ నిండా, చేతుల్నిండా చెమటపట్టింది.

ఏం పరవాలేదని మూర్తి ధైర్యం చెపుతూనే వున్నాడు. కానీ రామారావు మనసు వరకు ఆ మాటలేం చేరలేదు.

చెవులు దిబ్బెళ్ళు పడ్డట్టయ్యాయి ... మెదడంతా ఏదో హోరు ... అలాగే భయం భయంగా అటూ యిటూ చూస్తూ కూర్చున్నాడు రామారావు.

ఇంకా పూర్తిగా తెల్లారకముందే...నాలుగవుతుండగా నెమ్మదిగా ఆ కబురు కాస్తా చెప్పేశారు హాస్పిటల్ వాళ్ళు...మూర్తితో పాటు రామారావుకి స్పష్టంగా వినపడింది... "ఊర్మిళ చచ్చిపోయిందన్న" ఆ మాట...

రామారావు చలనం లేకుండా అలాగే కూచుండిపోయాడు రెండు మూడు నిమిషాలు. కాస్సేపటికి మెదడు, అలోచనలేని మనిషిలా మూర్తివేపు చూశాడు.

శవాన్ని సాయంత్రం నాలిగింటికి కానీ యివ్వటం కుదరదన్నాక మూర్తే బలవంతంగా లేవదీసి రామారావుని బైటికి తీసుకొచ్చాడు. వార్డు దాటుతుండగా ... నర్సు ఎవరితో అంటుంటే ఆ మాటలు వినపడ్డాయి...

"సాయంత్రం ఏదో యింజక్షనిచ్చారట.. ఆ తర్వాతే అలా బిగుసుకు పోయిందిట ... ఎడల్ట్రేటెడ్ డ్రగ్ అయి వుంటుం దంటున్నారు డాక్టరు" అని...

హాస్పిటల్ దాటి రోడ్డుమీద కొచ్చేటప్పటికి ఎండ బాగా వొచ్చింది. షాపు లొక్కొక్కటే తెరుస్తున్నారు.

మూర్తీ ఏం మాట్లాడలేక వూరుకున్నాడు. యంత్రంలా కూడా నడుస్తూ వచ్చాడు రామారావు.

ఒకటికి రెండుసార్లు కాఫీ తాగమని బలవంతంచేస్తే పెదాల దగ్గర పెట్టుకుని వో గుక్కకూడా పూర్తిగా తాగకుండా కింద పెట్టేశాడు రామారావు. కన్నీరు బైటికిరాలేని వొత్తిడివల్ల కాబోలు కళ్ళు బాగా ఎర్రబడ్డాయి.

అంత తొందరగా రామారావుని యింటికి తీసికెళ్ళాలంటే భయంగా వుంది మూర్తికి. తప్పదు కాబట్టి నెమ్మదిగా రిక్షా ఎక్కించాడు. తలొంచుకుని కూచోటం తప్ప రిక్షాలోకూడా ఏం మాట్లాడలేదు రామారావు.

హాస్పిటల్కి యిల్లు చాలాదూరం. రిక్షా నడుస్తున్నంత సేపూ రామారావుతో ఏదో వొకటి మాట్లాడాలని ఎంతో ప్రయత్నం చేశాడు మూర్తి. కానీ గొంతు పెగల్లేదు.

మరో పదినిముషాల్లో రిక్షా యిల్లు చేరుతుందనగా హఠాత్తుగా ... "రిక్షా ఆపు" అన్నాడు రామారావు ... ఇంకా రిక్షా ఆగక ముందే దిగాడు...

ఎందుకు దిగాడో మూర్తికి అర్థంకాలేదు. అప్పటికే రామారావు రోడ్డు దాటాడు. మూర్తి రిక్షా దిగాడు...

రామారావు వెళ్ళిన షాపులోకి మూర్తి అడుగుపెట్టే టప్పటికే రామారావు గట్టిగా అరుస్తున్నాడు,

"ఏడీ...ఆ దొంగలంజాకొడుకేడీ...కల్తీ మందులమ్మి ప్రాణా తీస్తాడా...ఏడీ రమ్మను. ఎక్కడున్నాడో రమ్మను..."

రామారావు ఎదురుగా వున్న కుర్రాడు విషయం తెలియక తెల్లముఖం వేశాడు.

మూర్తికి సంగతేమిటో అర్థమైంది ... రాత్రి రామారావు యింజక్షన్ కొన్న షాప్ యిదేనన్నమాట...అనుకున్నాడు.

"వూరుకో రామారావు ..." అని ఏదో చెప్పబోయాడు.

యీ లోగా లోపల్నుంచి వస్తున్నతని మీదికి వురకబోయాడు రామారావు. మూర్తి గట్టిగా పట్టుకున్నాడు.

"వొదులు...వీడే రాత్రి ఆ కల్తీ విషం యిచ్చింది...నా ఊర్మిళని చంపింది వీడే... వొదులు...నన్నొదులు..."

ఎంతో బలప్రయోగిస్తేనే కానీ రామారావుని షాపు బైటకి తీసుకురావటం కుదరలేదు మూర్తికి. బలవంతంగా రిక్షా ఎక్కించాడు. అంతే రిక్షాలో కూర్చున్న మరుక్షణం చిన్న పిల్లాడిలా బావురు మన్నాడు రామారావు. మూర్తి వొళ్ళో తలపెట్టుకుని కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు ... అంతవరకు ఆగిన రామారావు కన్నీళ్ళు గట్టు తెగినట్టు తన మోకాళ్ళని తడుపుతుంటే మూర్తికి కళ్ళు చెమర్చాయి.

○ ○ ○ ○

ఇంటికొచ్చిన చాలాసేపటి వరకూ ఏ దిక్కూ తోచని బాధే తప్ప మరో భావన రాలేదు రామారావుకి. విషయం తెలిసి చుట్టు

*With Best Compliments From*

**SANGEETHA TEXTORIUM**

**A. E. TEXTILE PIECE GOODS MERCHANTS**

**43,** Godown Street (2nd Floor)

**MADRAS**-600001

పక్కల వాళ్లు వచ్చి అనేక రకాలుగా పరామర్శచేసి వెళ్ళారు. ఎవరు వచ్చారో ఎవరు వెళ్ళారో కూడా తిన్నగా తెలియ లేదు రామారావుకి.

మధ్యాన్నం లక్ష్మీ. మూర్తీ మరీ బలవంతం చెయ్యటంవల్ల అన్నముందు కూచున్నాడు. కానీ రెండు ముద్దలు కూడ తినలేకపోయాడు.

ఇక రెండవుతుండగా..."మరి మనం యింక బైలుదేరదాం." అన్నాడు మూర్తి.

ఆ మాటతో బాధ్యత కర్మముందు నిచింది రామారావుకి. ఇంక రావాల్సినవాళ్ళు, చూడాల్సిన వాళ్ళుఎవరూ లేరు. కాబట్టి హాస్పిటల్ నుంచి అటే తీసుకుపోవచ్చని నిర్ణయం చేశారు.


మునిమాపువేళ. యింకా చీకటి బాగా కమ్ముకోకముందే ఎర్రట మంటల్లో ఊర్మిళని చీకట్లో కలిపేశాడు రామారావు. ఆ చితితో పాటే తన జీవితం కూడా కాలిపోయినట్టని పించింది రామారావుకి.

కుర్రాడికి వచ్చీ రానీ జ్ఞానం. ఇప్పటికే చాలాసార్లు అడిగాడు..."అమ్మేది..."అని. హాస్పిటల్‌లో వుందని లక్ష్మి నచ్చచెపుతూ వచ్చింది. ఆ ప్రశ్నవింటే రామారావు బాధ పడతాడని కుర్రాణ్ని సాధ్యమైనంత వరకూ తండ్రి కంట పడకుండానే చూసింది. పిల్లలిద్దర్నీ తనదగ్గరే పడుకోపెట్టుకుంది.

తన కూతురికి కూడా ఏడాది దాటక పోవటంవల్ల ఊర్మిళకన్న ఆర్రోజుల గుడ్డుకి కూడా తన పాలే యిచ్చింది లక్ష్మి.

కడుపుకి తిండి లేకపోవటంవల్లో, కలతగా వుండటంవల్లో రామారావు కంటికి నిద్దరే రాలేదు. ఒంటరితనం భరించలేనంతగా తోచింది. లైటు బాగా పెద్దదిచేసి దీపంవేపే చూస్తూ కూచున్నాడు. గాలికి కదులుతున్న దీపం చమటకి తడిసి కిందకి జారిన కుంకుమ రేఖలా కనబడుతోంది. ఊర్మిళ నవ్వు గుర్తొస్తోంది...మాటలు గుర్తొస్తున్నాయి- ఈ ఇల్లు మనకి కలిసొస్తుందని తను వుత్సాహంగా వినిపించిన ఆశలు వినబడుతున్నాయి రామారావుకి. కన్నీరు కారుతోందని తెలియకుండానే అలాగే చాలాసేపు కూచున్నాడు.

తెల్లవారింది...రామారావు బతుకులో ఊర్మిళలేని మరోరోజు గడిచింది. మూర్తే బలవంతం చేసి ప్రెస్‌కి తీసుకెళ్ళాడు రామారావుని.



అక్కడ వుండలేక మధ్యలోనే వచ్చేశాడు. యింటికొచ్చి చాలాసేపు వేపచెట్టు దగ్గరే కూచున్నాడు...లోపలికెళ్ళలేదు.

ఎప్పుడు చూశాడో నెమ్మదిగా తండ్రిదగ్గరకి చేరాడు రామారావు కొడుకు. ఆ పసి మనసుకి కొద్ది కొద్దిగా అర్థమైందేమో తల్లి గురించి అడక్కుండానే చాలాసేపు రామారావు వొళ్లో కూచున్నాడు.

మూర్తి కూడా తొందరగానే వచ్చాడు ప్రెస్‌నుంచి.

రామారావు విషయాలన్నీ యించుమించు మూర్తికి తెలిసినవే.

నెమ్మదిగా సాయంత్రపు గాలి తిరిగిం తర్వాత రామారావుని కదిపాడు మూర్తి.

"ఎవరో మీ పిన్ని ఉందన్నావు కదూ... నెమ్మదిమీద పిలిపిస్తే బావుంటుందేమో..." అన్నాడు.

మరోబాధ్యత...ఆమాట విన్నాక రామారావుకి అలా చెయ్యటం అవసరమే అనిపించింది.

"పిలిపించాలి...కానీ ఎలా..." అన్నాడు.

రామారావు అన్నది మూర్తికి అర్థమైంది. డబ్బు సమస్య. అంతకుముందే అప్పుల్లో వున్నాడు రామారావు. దానికితోడు పురిటికి అందినచోటల్లా అప్పుచేశాడు. ఆఫీసులో తీసుకోగలిగినంత ఎడ్వాన్సు తీసుకున్నాడు నిన్నటిరోజు హాస్పిటల్లో చితిమంటల్లో ఎంత ఖర్చయిందో మూర్తికి తెలుసు.

ఏదో వొకటి మాట్లాడి రామారావు మూడే మూర్చాలి అనే తప్ప దానివెనక విషయాలు మూర్తి పెద్దగా ఆలోచించలేదు. డబ్బు విషయం పొద్దున్న ప్రెస్‌కి వెళ్ళేటప్పుడు ఓసారి చర్చకి వచ్చింది.

ప్రెస్‌కి వెళ్ళేదారిలోనే ఆ మందుల షాపుంది. దానివేపే చూస్తూ వచ్చాడు రామారావు. చూసి...చూసి...నెమ్మదిగా...

"మనం ఏం చెయ్యలేమా మూర్తీ... వాడలా నా జీవితాన్ని నాశనం చేసినా ఏం చెయ్యలేమా..."అన్నాడు.

మూర్తి నెమ్మదిగా వివరాలన్నీ చెప్పాడు ..."కేసుపెట్టాలి. పెట్టాలంటే అనేక సాక్ష్యాలుకావాలి...డాక్టరుసాక్ష్యం, చేసిన ఆ యింజెక్షన్‌లో మిగిలిన మందు...యివన్నీ అంత తేలిగ్గా అయేపనులు కావు. ప్రతీదీ డబ్బుతో ముడిపడుంది...అన్ని ఖర్చులు పెట్టుకోగలిగి...కోర్టు చుట్టూ తిరగ్గలిగే ఓపికుంటేనే అందులోకి దిగాలి."

అన్నీ విని రామారావేం మాట్లాడలేదు. రామారావేమీ మాట్లాడకపోయినా, అతని గుండెల్లో మండుతున్న మంట మూర్తికి తెలియంది కాదు.

పొద్దున్నలాగే యిప్పుడు కూడా డబ్బు ప్రసక్తే కాబట్టి అంతటితో ఆ సంభాషణ ఆపేయటం మంచిదనిపించింది మూర్తికి. ఆ తర్వాత విషయం మార్చి వేరే ఏవో మాట్లాడాడుమూర్తి.

చీకటి పడుతోందంటే భయమనిపించింది రామారావుకి బాబు ఈ రాత్రికి లక్ష్మిదగ్గర పడుకోనని మొండికెయ్యటంవల్ల రామారావు దగ్గరికి పంపక తప్పలేదు లక్ష్మికి. అంతకీ

అయిదారుసార్లు...తల్లి హాస్పిటల్‌లో వుందని ...తండ్రిని ఆ విషయం అడగొద్దని మరీ పంపించింది.

బాబు కూడా వున్న నిద్దర పట్టలేదు రామారావుకి. నీరసంవల్ల మగతగా కళ్ళు మూసుకు పడుకున్నాడు.

గడుస్తున్న సమయం తెలుస్తూనే వుంది. ఇంక తెల్లారిపోతుండగా వేపచెట్టు చప్పుడుతోపాటు పసిగుడ్డు ఏడుపు కూడా వినిపించింది రామారావుకి. అయిదు నిమిషాలు గడిచినా ఏడుపు వినిపిస్తూనే వుంది. దానితోపాటు లక్ష్మి సముదాయింపు వినిపించింది.

'పాపం వాళ్ళే తంటాలు పడుతున్నారు ఆ పసిగుడ్డుతో ఎందుకేడుస్తోందో చూస్తే బావుంటుంది...' అన్నట్టు లేచాడు రామారావు... ఇంకా గుమ్మం దాటకముందే మూర్తిగొంతు వినిపించింది.

"ఎందుకు లక్ష్మి ఏడుస్తోంది...పాలివ్వ కూడదు..."

"యిస్తూనే వున్నానండీ...మన చంటికి యాడాది దగ్గర పడింది. యిద్దరికీ పాలు చాలటంలేదు... ఏం చెయ్యాలో తోచకుండా వుంది..." అంది లక్ష్మి నెమ్మదిగా.

ఇంక అడుగు ముందుకు వెయ్యలేక పోయాడు రామారావు. నెమ్మదిగా తిరిగి గదిలోకి వచ్చేశాడు.

ఏం చెయ్యాలో ఆలోచించాల్సింది తను. ఇంకా యిరవై రోజులు గడిస్తేనే కానీ జీతం రాదు. అప్పు ఎక్కడా పుట్టదు. కనీసం పిల్లకి పాలడబ్బాయేనా కొనాలి...ఎలా... యిప్పటికే మూర్తివాళ్ళమీద చాలా భారం మోపాడు...ఇంక వాళ్ళని యిబ్బంది పెట్ట కూడదు.

ఏ ఆలోచనా సాగలేదు రామారావుకి. నీరసం ఒళ్ళంతా కమ్ముకున్నట్టనిపించింది. మరింక నిలబడలేక నెమ్మదిగా మంచం మీదకి చేరాడు.

* * *

ప్రెస్‌కి వేళవుతోందని బలవంతంమీద లేచితయారవటం మొదలెట్టాడు రామారావు.

మూర్తితో ఎవరో సన్నగా మాట్లాడుతున్న మాటలు వినపడుతున్నాయి...ఆ సక్తి ఓపిక లేక బైటికి రాలేదు.

"ఉండండి పిలుస్తాను...మీరే చెప్పండి." అని మూర్తి అనటం తనని పిలవటం వినిపించేటప్పటికి వచ్చినవాళ్ళు ఎవరై వుంటారా అనిపించింది రామారావుకి.

ఆలోచిస్తూనే బైటికొచ్చాడు.

గుమ్మంలో అతన్ని చూడగానే తన ఒంటిని తను మరిచిపోయాడు రామారావు... మందుల షాపతను...

అప్పటికే మూర్తి రామారావు పక్క కొచ్చాడు.

"ఆవేశపడకు...ఆయన చెప్పేదివిను." అన్నాడు.
మందుల షాపతను ఓ అడుగు ముందుకేశాడు

"మీ బాధ నాకు తెలుసు...మీలోటు తీర్చలేననీ తెలుసు...ఇది నేను చావాలని చేసింది కాదు. ఆరోజు మీబాధ చూసి ఇల్లు వెతికి వెతికి తెలుసుకుని వచ్చేవరకూ నాకు మనశ్శాంతి కలగలేదు. ఇది మీకోసం కాక పోయినా నా మనశ్శాంతికోసం, నన్ను మన్నించి తీసుకోండి...ఈ ప్రమాదం నేను కావాలని చేసిందికాదు..." అంటూ వొంగి తను తెచ్చిన వాటిని రామారావు పక్కగా పెట్టి వెనక్కి తిరిగాడు.

చిన్న కవరులోంచి తొంగి చూస్తున్న వది రూపాయల నోట్లు...రామారావుకి అయోమయమైంది పరిస్థితి. మందులషాపతను అంత నమ్రతగా చెప్పినా, ఆ మాటల్లో ఆవగింజంత నిజం వున్నట్టు తోచలేదు రామారావుకి. అదంతా నటనే అనిపించింది. ఏదో రకంగా తనని లొంగదీసుకోటానికి వేసిన ఎత్తులాగే అనిపించింది.

ఆ నోట్లు కట్టకట్టి విసిరేయాలనుకున్నాడు

అందుకే తీశాడు...చెయ్యి వొణికింది... భుజంమీద మూర్తి చేతిస్పర్శ మరికొస్త బలంగా తెలిసింది. తెల్లారుఝామున వేపచెట్టు చేసిన చప్పుడు గుర్తొచ్చింది. పాలురాక దవడలు పీకేలా లక్ష్మి రొమ్ము పీల్చే పసిగుడ్డు ...ఊర్మిళ ప్రతిరూపం కళ్ళముందు కదిలింది. దూరానున్న విన్నిని పిలిపించటానికి అయ్యే ఛార్జీలు ఆలోచనలో చితిమంటలా కదిలాయి...

అంతే అందుకున్నవాటిని అలా వదిలేసి ...కుప్పలా అరుగుమీద కూలబడి రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు రామారావు.

"ఛీ వెధవ బ్రతుకు...విషపు కూడు తింటేనేకాని బతకలేని బతుకు..." అంటూ కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు. కిందున్న నోట్లకవర్‌ని తీశాడు మూర్తి. కాస్సేపటికి నెమ్మదిగా రామారావుని లేవతీశాడు...యిద్దరూ కలిసి యంత్రంలా ప్రెస్‌వేపు బయలుదేరారు,

★


వెత్సా విశ్వనాథం
సలాది అచ్చియ్యా అండ్ అదర్స్
కాంట్రాక్టర్స్: శ్రీ సీతారామాంజనేయ రైస్ మిల్లు
అనాతవరం [ముమ్మిడివరం తాలూకా]